క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లె ఎస్ఐగా విష్ణువర్ధన్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ మల్లికార్జున రెడ్డి వీఆర్‌కు బదిలీ అయ్యారు. విష్ణువర్ధన్ రెడ్డి వీఆర్ నుంచి లక్కిరెడ్డిపల్లె వచ్చినట్లు తెలిపారు.

గడప గడపకూ డీసీసీ బ్యాంక్

సంబేపల్లె : మండల పరిధిలోని మోటకట్ల పంచాయతీలో బుధవారం కడప డీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ డీసీసీ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

23న మండల సమావేశం

గాలివీడు : ఈనెల 23న మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ జిల్లా పద్మావతమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శేఖర్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

26 నుంచి సమ్మె

రాజంపేట : 26 నుంచి మున్సిపల్ కార్మికులు సమ్మె బాట పడుతున్నారు. ఈ మేరకు సమ్మె నోటీసును బుధవారం రాజంపేట మున్సిపల్ కమిషనర్ జనార్దన్ రెడ్డికి అందజేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కానందున సమ్మెకు వెళ్తున్నట్టు మున్సిపల్ కార్మిక నాయకులు తెలిపారు.

పాడి పరిశ్రమ వృద్ధికి కృషి

రైల్వేకోడూరు : జిల్లాలో పాడిపరిశ్రమ వృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని బుధవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శెట్టిగుంటలో సరోగసి ద్వారా జన్మించిన పుంగనూరు జాతి దూడను ఆయన పరిశీలించారు. పశుసంవర్ధకశాఖ అధికారులను అభినందించారు.

ప్రతిభను వెలికితీసేందుకే వైజ్ఞానిక ప్రదర్శనలు

పుల్లంపేట : వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల ప్రతిభ బయటపడుతుందని ఎంఈఓలు నాగా తిరుమలరావు, చక్రధర్ రాజులు తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్‌బీవీడీ సభా ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల ప్రాజెక్టులను ఎంఈఓలు తిలకించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులు జిల్లాస్థాయికి ఎంపికయ్యారు.

విజయవంతం చేయండి

గాలివీడు : ఈనెల 22న పప్పిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వసతి గృహంలో జరిగే సమీక్షా సమావేశానికి రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి హాజరవుతున్నారని ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జెడ్పీటీసీ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

అందరూ గర్వపడేలా నియోజకవర్గ అభివృద్ధి

రామాపురం : ప్రజలందరూ గర్వపడేలా రాయచోటి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తున్నానని వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం రామాపురం మండలం యర్రమరెడ్డిగారిపల్లెలో జరిగిన వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మహానేత వైఎస్ఆర్ మరణించిన సమయంలో వైఎస్ జగన్‌కు అందరూ తోడుగా నిలబడ్డారన్నారు. 1981 నుంచి తమ కుటుంబాన్ని నియోజకవర్గ ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. ఎన్నో ఒడిదిడుకులు ఎదురైనా ప్రజలకు తోడుగా నిలుస్తున్నామన్నారు. 2009 నుంచి తన రాజకీయ ప్రస్థానం మొదలైందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి చెరువును కృష్ణా జలాలతో నింపాలన్నదే తన కల అని తెలియజేశారు. చక్రాయపేట కాలేటివాగు పథకం పనులు జరుగుతున్నాయన్నారు. వెలిగల్లు కాలువలకు మరమ్మతులు చేయించి గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాలలోని పలు చెరువులను సాగునీటితో నింపామన్నారు. అర్హతే ఆధారంగా ప్రతి గడపకు సంక్షేమ పథకాలను సీఎం జగన్ అందించారన్నారు. రెండేళ్ల కరోనాతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదరైనా


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్నా ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని నిలుపుదల చేయకుండా చెప్పిన సమయానికి ముందుగానే సీఎం జగన్ అందించడం ఒక చరిత్ర అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను 99 శాతానికి పైగా నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. చరిత్రలో గుర్తిండిపోయే విధంగా రాయచోటిలో శాశ్వత అభివృద్ధి పనులను ప్రణాళికబద్ధంగా చేస్తున్నామన్నారు. జిల్లా కేంద్రంలో అన్ని సదుపాయాల కల్పనకు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు.

బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి పెద్దపీట

బడుగు, బలహీనవర్గాల సాధికారత, అభివృద్ధిని యాత్రల ద్వారా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వివరిస్తోందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ అధికారం చేపట్టి నాలుగన్నరేళ్ల పాలనా కాలంలో బడుగు, బలహీనవర్గాలకు ప్రాధాన్యత ఇచ్చి వారి సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. బీసీలు ఉన్నత పదవులకు పనికిరారని అప్పట్లో చంద్రబాబు కేంద్రానికి లేఖ రాసారని, దళితుల్లో ఎవరు పుట్టాలని కోరుకుంటారని, నాయీ బ్రాహ్మణుల తోక కత్తిరిస్తానని చంద్రబాబు మాట్లాడి బీసీ, ఎస్సీల మనోభావాలను దెబ్బతీశారని ఆయన గుర్తు చేశారు. ఈ నెల 28న రాయచోటిలో జరగనున్న బీసీ సాధికారిక బస్సు యాత్రను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని శ్రీకాంత్‌రెడ్డి కోరారు. మాజీ ఎంపీపీలు జనార్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటరమణ, రెస్కో మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ కర్నపు విశ్వనాథ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి పూజలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

రామాపురం : కుమ్మరపల్లె గ్రామం కంభరాయునికొండపై వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మహావిష్ణువు దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈ నెల 22 నుంచి ఈ నెల 24వ తేదీల వరకు నిర్వహించే పూజలలో పాల్గొనాలని ఆలయ ధర్మకర్త ముక్కోటి బసిరెడ్డి బండపల్లి కుమ్మరపల్లె గ్రామ ప్రజలు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిని బుధవారం ఆహ్వానించారు.

రోగుల పాలిట వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సంజీవని

రాజంపేట : రోగుల పాలిట వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సంజీవని లాంటిదని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయం (రాజంపేట)లో నందలూరు మండలానికి సంబంధించి ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద రూ.25లక్షల వరకు ఉచితంగా వైద్యం కోసం కొత్త ఫీచర్స్‌తో ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను అందజేస్తున్నామన్నారు. దివంగత సీఎం వైఎస్ఆర్ తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీని ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలోపేతం చేశారన్నారు. ఆరోగ్యశ్రీని విస్తృతపరిచి పేదలను ఆదుకుకోవడంలో ముఖ్యమంత్రి నిర్ణయాలు చరిత్రాత్మకంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యనారాయణ, సయ్యద్ అమీర్, కలీం, పి.నాగసుబ్బయ్య, సర్పంచ్ వెంకటనరసయ్య, ఏ.విశ్వనాథ, సి.నరసింహ, ఫరూక్, షావల్లి, వైద్యులు డా.శరత్, కార్తీక్ విశ్వనాథ్, ఎంపీడీఓ సౌభాగ్య, సీహెచ్ఓ నారాయణ పాల్గొన్నారు.


లబ్ధిదారుకు ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డును అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

జెడ్పీ చైర్మన్ ఆకేపాటికి ఆహ్వానం

రాజంపేట రూరల్ : జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డికి పట్టణంలోని రామ్ నగర్‌లో ఉన్న చర్చి ప్రతినిధులు 25న నిర్వహించే క్రిస్మస్ వేడుకలకు హాజరుకావాలని కోరారు. ఆకేపాడులోని ఆకేపాటి ఎస్టేట్‌కు బుధవారం చేరుకున్న చర్చి ప్రతినిధులు ఆకేపాటిని ఘనంగా సన్మానించారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

పెనగలూరు (ఓబులవారిపల్లె) : విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ నాయకులు తెలిపారు. బుధవారం ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసనకు ఎస్టీయూ నాయకులు సంఘీభావం తెలిపారు.

రెగ్యులర్ ప్రక్రియలో జాప్యం జరుగకూడదు

రాయచోటి అర్బన్ : కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసే ప్రక్రియలో జాప్యం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ డీఎస్సీ, కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

సంక్షిప్తం

అంగన్‌వాడీల భిక్షాటన

రాయచోటి అర్బన్ : తమ సమస్యల పరిష్కారంలో పాలకులు చూపుతున్న నిర్లక్ష్యానికి నిరసనగా బుధవారం అంగన్‌వాడీలు పట్టణంలో ఖాళీ ప్లేట్లతో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు.

అభినందన

ఓబులవారిపల్లె : జిల్లా స్థాయిలో నిర్వహించే వైజ్ఞానిక ప్రదర్శనకు పాఠశాల విద్యార్థులు టి.నందిని, వై.జశ్వంతి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రమణయ్య తెలిపారు.

పోస్టల్ సేవలు వినియోగించుకోండి

ఓబులవారిపల్లె : పోస్టల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజంపేట పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె.అమర్‌నాథ్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో పోస్టాఫీసు ద్వారా ప్రజలు అందించే సేవలు గురించి ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.

రోగులకు పండ్లు పంపిణీ

నందలూరు(రాజంపేట) : సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ముందస్తుగా బుధవారం జిల్లా వక్ఫ్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీలోని రోగులకు పండ్లు అందజేశారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

రాయచోటి టౌన్ : ఆడుదాం ఆంధ్రా క్రీడల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో రాయచోటి మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, ఎంపీడీఓ మల్ రెడ్డిలు ప్రాక్టీస్ సెషన్‌ను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా సామగ్రిని అందజేశారు.

ప్లాస్టిక్ వ్యర్థాలను వేస్తే చర్యలు

సిద్దవటం : లంకమల అభయారణ్యంలో ప్లాస్టిక్ వ్యర్థాలను వేస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని సిద్దవటం రేంజర్ బి. కళావతి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జంతువులు ప్లాస్టిక్ వ్యర్థాలను తిని మృత్యువాత పడుతున్నాయన్నారు. ఆలయాలకు వచ్చే భక్తులు ప్లాస్టిక్‌ను అటవీ మార్గంలో వేయరాదన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష, జరిమాన

నందలూరు(రాజంపేట) : స్థానిక పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో రమణ అనే వ్యక్తికి రెండు రోజులు జైలు శిక్ష, అమ్రియు నాయక్ అనే వ్యక్తికి రూ. 10 వేలు జరిమానాను నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కె.లత విధించినట్లు ఎస్ఐ అబ్దుల్ జహీర్ తెలిపారు.

తెగులు నివారణపై అవగాహన

రాజంపేట రూరల్ : అరటిలో ప్రధాన సమస్య అయిన సిగటోక ఆకుమచ్చ తెగులు ఉధృతిని సమగ్ర యాజమాన్య పద్ధతుల ద్వారా నివారణపై ఉద్యాన అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఆకేపాడు ఆర్బీకే పరిధిలోని రైతులకు అరటి సాగులో తీసుకోవల్సిన జాగ్రత్తలపై ఉద్యాన అధికారి జి.సురేష్‌బాబు వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట రూరల్ : మండలంలోని చింతల కోనలో ఖాళీగా ఉన్న మినీ అంగనవాడీ కార్యకర్త(ఓసీ-6) పోస్టు భర్తీకి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ వై.సుజామణి బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

బెటాలియన్‌లో సెమీ క్రిస్మస్

సిద్దవటం : ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో బుధవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా బెటాలియన్ కమాండెంట్ ఎస్.శ్రీనివాసరావు హాజరయ్యారు.

వీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర

సంబేపల్లె : రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నాయని ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిలు అన్నారు. బుధవారం నాగిరెడ్డిపల్లె, ఎస్ సోమవరంలలో వీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

రాయచోటి అర్బన్ : విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో పాలకుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులు కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నేతలు మాట్లాడుతూ కరువు ప్రాంత విద్యార్థులకు ఫీజులను రద్దు చేయాలన్నారు.